# నమస్తే తెలంగాణ

## మంచిర్యాల

కుమ్రం భీం ఆసిఫాబాద్

5 | సోమవారం 17 జూన్ 2024 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD


## చుక్కల దుప్పి అప్పగింత



చికిత్స చేస్తున్న అధికారులు

జైపూర్ (భీమారం), జూన్ 16 : జైపూర్ మండలం ముదిగుంట గ్రామానికి దారి తప్పి వచ్చిన చుక్కల దుప్పిని కుక్కలు వెంబడించాయి. ఈ క్రమంలో గ్రామ శివారులో స్పృహతప్పి పడిపోయింది. గమనించిన గ్రామస్తులు అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. అటవీ అభివృద్ధి సంస్థ మంచిర్యాల రేంజ్ ప్లాంటేషన్ మేనేజర్ గోగు సురేశ్ కుమార్ అక్కడికి వచ్చి, గాయపడిన దుప్పికి చికిత్స అందించారు. తిరిగి అటవీ ప్రాంతంలో వదిలేశారు. గ్రామస్తులు నాగపురి రాములు, దాసరి లవన్, సారంగపల్లి రాజయ్య, పట్టెం రాజన్న, పెట్టం బన్ని, పసలోట రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## టైగర్ రిజర్వ్ అడవిలో ఎన్ఐఏ ఎస్పీ పర్యటన

జన్నారం, జూన్ 16 : కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ ఫారెస్ట్‌లో హైదరాబాద్‌కు చెందిన ఎన్ఐఏ ఎస్పీ సుధార్ బిజీ(బీహార్)కు చెందిన అధికారి ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి జంగల్ సఫారీ వాహనంలో పర్యటించారు. జన్నారం, తాళ్లపేట్ రేంజ్ పరిధిలో గోండుగూడ వాచ్‌టవర్, బైసన్‌కుంట ప్రాంతాల్లో పర్యటించారు. వన్యప్రాణులను, గడిక్షేత్రాలు, భారీ వృక్షాలు, నీటి కుంటలను పరిశీలించారు.



కవ్వాల్ అడవులో జంగల్ సఫారీ వాహనంలో పర్యటిసున్న ఎన్ఐఏ ఎస్పీ సుధార్‌బిజీ

# నేడు బక్రీద్

- వేడుకలకు ఈద్గాలు, మసీదులు ముస్తాబు
- బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు



దండేపల్లిలో ముస్తాబైన ఈద్గా

దండేపల్లి /చెన్నూర్ టౌన్/ జైనూర్, జూన్16: ఇబ్రహీం అలైహిస్సలాం త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే ఈద్-ఉల్-అజ్‌హా(బక్రీద్)కు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని ఈద్గాలు, మసీదులు ముస్తాబయ్యాయి. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

### పండుగ విశిష్టత..

అల్లాహ్ ముఖ్య ప్రవక్త హజ్రత్ ఇబ్రహీం ఇస్లాం విశ్వాసాలను ప్రపంచమంతా ప్రచారం చేసేవాడు. ఇబ్రహీంకు పెళ్లయిన చాలా ఏండ్లకు కుమారుడు జన్మిస్తాడు. అతనికి ఇస్మాయిల్ అని నామకరణం చేసి అల్లారుముద్దుగా పెంచుకుంటాడు. అల్లాహ్(దైవం) వరుసగా మూడు రోజులు ఇబ్రహీం కలలోకి వచ్చి 'నీ కుమారుడిని బలి ఇవ్వాలి' అని సందేశాన్ని వినిపిస్తాడు. అల్లాహ్ కోసం ఇబ్రహీంతో పాటు ఆయన భార్య అంగీకరిస్తారు. తన తండ్రి తీసుకున్న నిర్ణయానికి ఇస్మాయిల్ సంతోషంగా ప్రాణత్యాగానికి సిద్ధమవుతాడు. దీంతో అల్లాహ్ దైవవాణి ద్వారా 'ఇబ్రహీం ఇది నిన్ను పరీక్షించేందుకే..నా పరీక్షలో నీవు గెలిచావు. కుమారుడి బదులు ఓ జీవాన్ని (గొర్రె)బలి ఇవ్వు' అని కోరుతాడు. ఆ రోజును బక్రీద్‌గా నిర్వహిస్తున్నారు. ఖుర్బానీగా జంతువును బలి ఇస్తున్నారు. ఇస్లాం క్యాలెండర్ ప్రకారం 12వ నెల జిల్‌హజ్ 22న బక్రీద్‌ను జరుపుకుంటారు. బక్రీద్‌కు ముందు రోజు కుటుంబ సభ్యుల సమాధుల వద్ద వారికి ఇష్టమైన దుస్తులు, ఆహార పదార్థాలు, వస్తువులు ఉంచుతారు.

### ఖుర్బానీ సమర్పించడం ఆనవాయితీ..

రంజాన్ మాదిరిగానే బక్రీద్ పండుగను కూడా ఖుద్బా(ధార్మిక ప్రసంగం)తో ఈద్గాలో సామూహిక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఆ తర్వాత నెమరువేసే జంతువులు (ఒంటే, మేక, గొర్రె ) మాత్రమే ఖుర్బానీ(బలి) ఇస్తారు. బలి ఇచ్చిన తర్వాత దానిని మూడు భాగాలుగా విభజించి ఒక భాగాన్ని పేదలకు, మరొక భాగాన్ని బంధువులకు పంచుతారు. ఇంకో భాగం తమ కోసం ఉంచుకుంటారు. హజ్ చేయలేని వారు కేవలం తామున్న చోటే అందరూ కలిసి సామూహికంగా నమాజ్ చేసుకొని ఖుర్బానీ సమర్పించుకొని పండుగ చేసుకుంటారు.

### ఈద్గాల ముస్తాబు..

ఖుర్బానీ(బలి)ఇచ్చేందుకు మేకలు, గొర్రెలను ఇప్పటికే కొనుగోలు చేశారు. మంచిర్యాల జిల్లా కేంద్రంతో పాటు దండేపల్లి, తాళ్లపేట, ముత్యంపేట, లక్షెట్టిపేట, జన్నా రం, చెన్నూర్, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంతో పాటు జైనూర్ మండలం జంగాం, గౌరి, తదితర గ్రామాల్లో ఈద్గాలు, మసీదులను ముస్తా బు చేశారు. పట్టణాలు, మండల కేంద్రాల్లో పోలీసులు పీస్ కమిటీ సమావేశాలు ఏర్పాటు చేసి పండుగను శాంతియుతంగా నిర్వహించుకోవాలని సూచిస్తున్నారు.



జైనూర్‌లో ముస్తాబైన ఈద్గా

## ప్రశాంత వాతావరణంలో పండుగలను నిర్వహించుకోవాలి

- సోషల్ మీడియాలో వచ్చే వదంతులను నమ్మొద్దు
- రామగుండం పోలీస్ కమిషనర్ ఎం. శ్రీనివాస్

మంచిర్యాల ఏసీసీ, జూన్ 16 : బక్రీద్ పండుగను రామగుండం కమిషనరేట్ పరిధిలోని ముస్లింలు ప్రశాంత వాతావరణంలో శాంతియుతంగా నిర్వహించుకోవాలని పోలీస్ కమిషనర్ ఎం శ్రీనివాస్ సూచించారు. ఆదివారం రామగుండం కమిషనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల్లో ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మసీదులు, ఈద్గాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బందోబస్త్ విధులకు హాజరయ్యే అధికారులకు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల వ్యాప్తంగా 15 రోజులుగా చెక్ పోస్టులను ఏర్పాటు చేసి నిరంతరం వాహనాల తనిఖీలు చేపట్టి ఆవుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. కమిషనరేట్ పరిధిలోని పోలీసు అధికారులు, సిబ్బంది మొత్తం బక్రీద్ బందోబస్తులో పాల్గొంటారని తెలిపారు. సోషల్ మీడియా ద్వారా అసత్య ప్రచారాలు, ఇతరుల మనోభావాలు దెబ్బతినే విధంగా అభ్యంతరకర పోస్టులకు ప్రజలు ప్రతిస్పందించకుండా, సంయమనం పాటించాలన్నారు. ఆ పోస్టుల్లో నిజాలను తెలుసుకునేందుకు ప్రయత్నించాలన్నారు. ఎలాంటి వదంతులు వచ్చినా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని లేదా 100 నంబర్‌కు డయల్‌చేసి చెప్పాలని కోరారు. సోషల్ మీడియాలో తప్పుడు వార్తలను పోస్ట్ చేసిన వారితో పా టు ఫార్వార్డ్ చేసే గ్రూప్ అడ్మిన్లపై చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రామగుండం సీపీ ఎం శ్రీనివాస్

### బక్రీద్‌ను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్

ఆసిఫాబాద్ టౌన్, జూన్16 : బక్రీద్‌ను ముస్లింలు శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని కుమ్రం భీం ఆసిఫాబాద్ ఎస్పీ సురేశ్ కుమార్ సూచించారు. బక్రీద్ సందర్భంగా బందోబస్తు నిర్వహించబోయే అధికారులతో ఆదివారం టెలీకాన్ఫరెన్స్ ద్వారా పలు సూచనలు చేశారు. జిల్లా వ్యాప్తంగా 20 రోజులుగా ఆరు చెక్ పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఆసిఫాబాద్, కాగజ్‌నగర్, రెబ్బెన, జైనూరు మండల కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు చేసి ఆవుల అక్రమ రవాణా జరగకుండా చర్యలు తీసుకున్నామని తెలిపారు. బక్రీద్ సందర్భంగా జిల్లా వ్యా ప్తంగా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసిన ట్లు తెలిపారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే వదంతులను నమ్మవద్దని వాటిని సంబంధిత అధికారులు దృష్టికి తీసుకెళ్లాలని తెలిపారు. డయల్-100 లేదా సం బంధిత పోలీస్ స్టేషన్లకు సంప్రదించాలని తెలిపారు. శాం తిభద్రతలకు విఘాతం కలిగించాలని చూసినా లేదా అవాంఛనీయ చర్యలకు పాల్పడినా చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# కవ్వాల్ ఫారెస్ట్‌లో జంతుగణన

- ఈ నెల 20 వరకు కొనసాగనున్న కార్యక్రమం
- వన్యప్రాణుల సంరక్షణకు చర్యలు
- జన్నారం ఇన్‌చార్జి రేంజ్ ఆఫీసర్ సుష్మారావు



జన్నారం తాళ్ల పేట అటవీ ప్రాంతంలో వన్యప్రాణులను ప్రత్యక్షంగా గుర్తిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లు



జన్నారం అటవీ ప్రాంతంలో వన్యప్రాణుల మలం నమూనాలను సేకరిస్తున్న సిబ్బంది

జన్నారం, జూన్ 16 : కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ అడవుల్లోని జన్నారం, తాళ్లపేట, ఇందన్‌పెల్లి, ఉడుంపూర్, బీర్సాయిపేట, కడెం రేంజ్‌ల పరిధిలోని కోర్ ఏరియా ప్రాంతాల్లో పులి మినహా మాంసాహార, శాఖాహార జంతువుల గణన చేపడుతున్నారు. మే 2న ప్రారంభమైన ఈ కార్యక్రమం జూన్ 20 వరకు కొనసాగనుందని అటవీశాఖ అధికారులు తెలిపారు. చిరుత, అడవి కుక్కలు, ఎలుగుబంట్ల పాదముద్రలు, మల, మూత్ర విసర్జితలను గుర్తిస్తున్నారు. శాఖాహార జంతువులైన అడవి బర్రెలు, మనుబోతులు, దుప్పులు, అడవి పందులు, చుక్కల జింకలు, గడ్డి జింకలు, కొండ గొర్రెల పాదముద్రలు, వెంట్రుకలను సేకరించడంతో పాటుగా వన్యప్రాణులను ప్రత్యక్షంగా గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం మనుబోతులు, అడవి పందుల సంఖ్య అధికంగా పెరిగిందని, చుక్కల దుప్పులు, గడ్డి జింకలు, కొండగొర్రెల సంఖ్య తక్కువగా ఉన్నట్లు గుర్తించినట్లు అధికారులు తెలిపారు.

### వన్యప్రాణుల రక్షణకు అన్ని చర్యలు తీసుకున్నాం



కవ్వాల్ టైగర్ రిజర్వ్‌డ్ అడవిలోని మాంసాహార, శాఖాహార జంతువుల సంఖ్యను పెంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. వన్యప్రాణులకు ఆహారం అందించేందుకు అడవుల్లో విరివిగా గడ్డిక్షేత్రాలను పెంచుతున్నామని వేసవిలో తాగునీటికి ఇబ్బంది పడకుండా ఉండేందుకు సోలార్ మోటర్ల ద్వారా నీటి కుంటలో నీటిని నింపడం, వాగుల్లో చెలిమలు ఏర్పాటు, సాసర్ పిట్లలో నీటి పోసి వాటి దాహాన్ని తీరుస్తూ వాటిని కాపాడుతున్నాం.

-జన్నారం ఇన్‌చార్జి రేంజ్ అధికారి సుష్మారావు





చెన్నూర్‌రూరల్ : తుర్కపల్లిలో ఇంటిపై కూలిన పైకప్పు, ఇంటిపై కప్పు కూలడంతో వృద్ధురాలి తలకు గాయం

# గాలివాన బీభత్సం

- ఎగిరిపోయిన ఇంటి పైకప్పు.. వృద్ధురాలికి గాయాలు
- సూరారంలో పిడుగు పాటుతో 14 గొర్రెలు మృతి

చెన్నూర్ రూరల్/చెన్నూర్ జూన్ 16: చెన్నూర్ మండలంలో ఆదివారం గాలివాన బీభత్సం సృష్టించింది. మండలంలోని తుర్కపల్లిలో వృద్ధురాలు మీసాల మల్లక్క రేకుల ఇంటి పైకప్పు కొట్టుక పోయింది. మల్లక్క తలపై రేకులు పడడంతో తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు గమనించి వెంటనే చెన్నూర్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. పలు గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ఏఈ భాస్కర్ ఆధ్వర్యంలో వెంటనే మరమ్మతులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. చెన్నూర్ పట్టణంలో మోస్తారు వర్షం కురిసింది.

### పిడుగు పాటుతో 14 గొర్రెలు మృతి

వేమనపల్లి, జూన్ 16 : వేమనపల్లి మండలంలోని సూరారం గ్రామ శివారులో గొర్రెల మందపై ఆదివారం సాయంత్రం పిడుగు పడడంతో 14 గొర్రెలు మృతి చెందాయి. వీటి విలువ రూ.1.20 లక్షలు ఉంటుందని కన్నెపల్లి మండలం మొక్కంపల్లికి చెందిన బాధితులు మేకల రాజయ్య, హేమంత్ తెలిపారు. అధికారులు నష్టపరిహారం అందించి ఆదుకోవాలని బాధితులు కోరారు. వేమనపల్లి మండలంలోని జిల్లెడ, సూరారం, బుయ్యారంలో వర్షం కురిసింది.

భీమారం, జూన్ 16 : భీమారంతో పాటు పోలంపల్లి, భీమారం, ఆరెపల్లి, దాంపూర్, ఖాజీపల్లి, కొత్తపల్లి, మద్దికల్, ధర్మారం గ్రామాల్లో వర్షం కురియడంతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది.

జై నూర్ : జైనూర్ పట్టణంలో ఆదివారం మధ్యాహ్నం నుంచి భారీ వర్షం కురిసింది. దీంతో వాహనదారులు ఇబ్బంది పడ్డారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలిగింది. వర్షంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు.



వేమనపల్లి : సూరారంలో మృతిచెందిన గొర్రెలు

## శుభకార్యం జరగాల్సిన ఇంట్లో విషాదం

- ఉరేసుకొని ప్రైవేట్ స్కూల్ ప్రిన్సిపాల్ ఆత్మహత్య
- భర్త వేధింపులే కారణమంటూ కుటుంబ సభ్యుల ఆరోపణ

మంచిర్యాల ఏసీసీ, జూన్ 16 : రెండు రోజుల్లో కూతురి 'సారీ ఫంక్షన్'ను తనకున్న స్థోమతకు తగ్గట్లు చేద్దామని అనుకున్నది ఆ తల్లి. తెలిసిన వారి దగ్గరి నుంచి రూ.80వేలు అప్పు తెచ్చింది. బంధువులు, తోటి ఉపాధ్యాయులకు, స్నేహితులను ఆహ్వానించింది. ఇంతలోనే ఆ తల్లి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ ఇంట్లో విషాదం నెలకొన్నది. ఈ ఘటన మంచిర్యాల జిల్లా కేంద్రంలో శనివారం రాత్రి జరిగింది. మృతురాలి కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మందమర్రికి చెందిన మహేశ్, మంచిర్యాల జిల్లా కేంద్రంలోని హమాలీవాడకు స్నేహశీల 2010లో ప్రేమ వివాహం చేసుకున్నారు. పెళ్లయిన కొద్దిరోజులకే వారి మధ్య గొడవలు జరిగాయి. మహేశ్ ఏ పని చేయపోవడంతో స్నేహశీల ప్రైవేట్ పాఠశాలలో టీచర్‌గా పనిచేసేది. ఆ తర్వాత మంథనిలో ఓ ప్రైవేట్ పాఠశాలను లీజుకు తీసుకొని భార్యభర్తలిద్దరూ నిర్వహించగా నష్టపోయారు. ప్రస్తుతం స్నేహశీల లక్షెట్టిపేట పట్టణంలోని శ్రీ చైతన్య టెక్నో పాఠశాలలో ప్రిన్సిపాల్‌గా విధులు నిర్వహిస్తున్నది. భర్త మద్యానికి బానిసై స్నేహశీలను అనుమానించడంతో పాటు తన ఇంటి వద్ద నుంచి డబ్బులు తీసుకరావాలని నిత్యం వేధించేవాడు. ఈ విషయంపై పలుమార్లు పోలీస్ స్టేషన్లో కూడా పంచాయితీలు జరిగాయి. ఈ క్రమంలో రెండు రోజుల్లో కూతురి ఫంక్షన్ కోసం తెచ్చిన డబ్బులు తనకు ఇవ్వాలని, ఫంక్షన్ అవసరం లేదని శనివారం గొడవ చేశాడు. దీంతో మనస్తాపంతో స్నేహశీల శనివారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో ఇంట్లో ఫ్యాన్‌కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఈ మేరకు మంచిర్యాల పట్టణ ఎస్ఐ మహేందర్ కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతురాలికి కూతుళ్లు మనస్వీ, సమాఖ్య ఉన్నారు.



జంజిరాల స్నేహశీల (ఫైల్ )

# ప్రజా శ్రేయస్సుకు సమష్టిగా కృషి చేద్దాం

### మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నస్పూర్, జూన్ 16 : ప్రజా శ్రేయస్సు, జిల్లా అభివృద్ధికి సమష్టిగా కృషి చేద్దామని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఐఏఎస్ అధికారుల బదిలీల్లో భాగంగా జిల్లాకు వచ్చిన కుమార్ దీపక్ ఆదివారం మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా నస్పూర్‌లోని కలెక్టరేట్‌లో ఆదివారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సంక్షేమం, జిల్లాలోని అన్ని ప్రాంతాల అభివృద్ధికి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులకు అందించేందుకు అధికార యంత్రాంగంతో కలిసి పనిచేస్తానని అన్నారు. బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా కుమార్ దీపక్‌కు అదనపు కలెక్టర్లు రాహుల్, సబావత్ మోతీలాల్, ఆర్డీవో రాములు, కలెక్టరేట్ పరిపాలన అధికారి రాజేశ్వర్, ఎన్నికల తహసీల్దార్ శ్రీనివాస్, నస్పూర్ తహసీల్దార్ శ్రీనివాస్ స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు. నాగర్ కర్నూల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహించిన కుమార్ దీపక్ ఉద్యోగోన్నతిపై కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. 1 ఫిబ్రవరి 2023 నుంచి మంచిర్యాల జిల్లా కలెక్టర్‌గా విధులు నిర్వహించిన బదావత్ సంతోష్ నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు.



కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరిస్తున్న కుమార్ దీపక్

# అ'పూర్వ' సమ్మేళనం



మంచిర్యాలలో సమ్మేళనంలో 1999-2000బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు

మంచిర్యాల ఏసీసీ, జూన్ 16: మంచిర్యాల పట్టణంలోని పాత మంచిర్యాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన 1999-2000 పదో తరగతి బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థుల సమ్మేళనం ఆదివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని సురభి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. రెండు దశాబ్దాల అనంతరం కలుసుకొని యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆ నాటి జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



జైపూర్ ప్రభుత్వ పాఠశాలలో 2003-04బ్యాచ్ టెన్త్ పూర్వ విద్యార్థులు

### జైపూర్ జడ్పీఎస్ఎస్‌లో..

జైపూర్, జూన్ 16: మండల కేంద్రంలోని జడ్పీఎస్ఎస్ పాఠశాలలో ఆదివారం 2003-04 సంవత్సరానికి చెందిన పదవ తరగతి విద్యార్థులు సమావేశం నిర్వహించారు. ఆ నాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పటి గురువులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు కన్నయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## బాసర కిటకిట

అమ్మవారి దర్శనానికి క్యూలైన్‌లో వేచి ఉన్న భక్తులు



బాసర, జూన్ 16 : బాసర సరస్వతీ అమ్మవారి సన్నిధిలో ఆదివారం భక్తుల సందడి కనిపించింది. అమ్మవారి దర్శనానికి రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా మహారాష్ట్ర నుంచి భక్తులు తరలివచ్చారు. ముందు గా గోదావరిలో పుణ్యస్నానాలు ఆచరించారు. అనంతరం అమ్మవారి దర్శనానికి బారులుదీరారు. పాఠశాలలకు పునఃప్రారంభం అయిన దృష్ట్యా విద్యార్థులు అత్యధికంగా తరలివచ్చారు. అదే విధంగా భక్తులు తమ చిన్నారులకు అక్షరశ్రీకార పూజలు చేయించారు. దీంతో అక్షరశ్రీకార మండపాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయ పరిసరాల్లో భక్తుల కోలాహలం కనిపించింది.


- జన్మదిన శుభాకాంక్షలు
- పొలిటికల్
- స్వదేశాగమనం
- లీగల్ ప్రకటనలు
- క్లాసిఫైడ్స్
- పదవీ విరమణ
- ప్రారంభోత్సవం
- శ్రద్ధాంజలి
- సినిమా
- వివాహ మహోత్సవం
- షష్టిపూర్తి మహోత్సవం మరియు
- అన్ని శుభకార్యాలు

నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం.. మన పత్రిక...

నమస్తే తెలంగాణ దినపత్రికలో ప్రకటనల కోసం సంప్రదించండి..

ప్రకటనల విభాగం...

సెల్: 9182 777 571

మంచిర్యాల జిల్లా : 9182 777 676

కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా : 9182 777 679